


నామినేషన్ కౌంటర్ (5వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకవర్గాలు	ఐదో రోజు నామినేషన్లు	మొత్తం
నరసాపురం ఎంపీ	09	14
1.ఆచంట	01	06
2.పాలకొల్లు	00	06
3.నరసాపురం	00	05
4.భీమవరం	07	10
5.ఉండి	05	12
6.తణుకు	02	10
7.తాడేపల్లిగూడెం	04	07
మొత్తం	19	56
ఏలూరు ఎంపీ	03	11
1.ఉంగుటూరు	06	10
2.దెందులూరు	02	07
3.ఏలూరు	05	07
4.పోలవరం	04	09
5.చింతలపూడి	02	08
6.నూజివీడు	01	08
7.కైకలూరు	06	11
మొత్తం	26	65



భీమవరంలో ఓ బంగారు నగల వ్యాపారికి పట్టణంలో 13 సెంట్ల స్థలం ఉంది. రెండేళ్ల నుంచి స్థలాన్ని అమ్మకానికి పెట్టారు. ఒక్కరూ అడిగేవారు లేరు. ఆ ఖాళీ స్థలానికి గతంలో రూ.5 వేల పన్ను చెల్లించేవారు. ఇప్పుడది రూ.10 వేలు అయ్యింది. అదే వ్యాపారి మొత్తం తన ఆస్తులకు రూ.2 లక్షలు చెల్లిస్తే సరిపోయేది. వైసీపీ ప్రభుత్వంలో రూ.4 లక్షలు చెల్లిస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో ఓ వ్యాపారికి గతంలో రైస్‌మిల్లు ఉండేది. ఇప్పుడు దానిని మూసివేశారు. ఆ స్థలం విలువ రూ.7 కోట్లు ఉండేది. ఇప్పుడు దాని విలువ పడిపోయింది. గతంలో అదే స్థలానికి రూ.2 లక్షల ఆస్తి పన్ను చెల్లించేవారు. ఇప్పుడు రూ.4 లక్షలు చెల్లిస్తున్నారు. ఆస్తి విలువ తగ్గింది. కానీ పన్ను మాత్రం పెరిగింది.

తణుకులో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తికి చిన్నపాటి ఇల్లు ఉంది. ఐదేళ్ల క్రితం రూ.1000 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఐదేళ్లలో అదనంగా మరో రూ.1000 పెంచి రెండు వేలు చేశారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ధరలు ఎక్కడ తగ్గాయ్ జగన్



ఇలా పట్టణాల్లో ఆస్తి పన్ను ఐదేళ్ల నుంచి పెరుగుతూ వస్తోంది. మున్సిపాలిటీల ఆదాయం పెరిగినా ఆస్తుల విలువ పెరగలేదు. మౌలిక వసతుల కల్పన లేదు. సీఎం జగన్ 2019 ఎన్నికల ముందు బాదుడే-బాదుడు అంటూ టీడీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అన్ని ధరలు పెరిగాయంటూ విమర్శలు గుప్పించారు. మీ బిడ్డ అధికారంలోకి వస్తే అన్నీ తగ్గిపోతాయంటూ లెక్కకు మిక్కిలి ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వీరబాదుడు బాదుతున్నారు. అమాంతంగా పన్నులు పెంచేశారు. పట్టణాల్లో ఏటా 15 శాతం పన్ను పెంచేస్తున్నారు. మున్సిపాలిటీలకు ఆదాయం పెంచడమే ఏకైక లక్ష్యంగా పన్నులు పెరుగుతున్నాయి. ఇదే తరహాలో ఆస్తుల విలువ పెరిగితే పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. ఐదేళ్ల నుంచి ఆస్తుల విలువ తగ్గుతోంది. స్థలాలు కొనుగోలు చేసేవారు లేరు. పట్టణాల్లో రియల్ ఎస్టేట్ స్తంభించింది. స్థలాలు అమ్ముకుందామంటే అడిగేవారు లేరు. నిర్మాణ రంగం అంతంతమాత్రమే. కానీ పట్టణ ప్రజలపై పన్నుల భారం పడుతోంది.

బాదుడే బాదుడు

- తగ్గిన ఆస్తుల విలువ.. మౌలిక వసతులు కరువు
- మంచినీటికి ఇబ్బందే.. ఐదేళ్లలో పట్టణాల అభివృద్ధి ఇదీ
- గగ్గోలు పెడుతున్న జనం

పట్టణాల్లో ఈ ఐదేళ్లు పెరిగిన పన్నులు



చెత్త పన్ను భారం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త పన్నును అమలులోకి తెచ్చారు. ఒక్కో పట్టణంలో ఒక్కో మాదిరిగా చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. గతంలోనూ ఇంటింటా చెత్తను సేకరించేవారు. ఇప్పుడు ప్రత్యేక వాహనాలను సమకూర్చారు. వాటి నిర్వహణకు చెత్తపన్ను అమలు చేశారు. జిల్లాలో అన్ని పట్టణాల్లోనూ ఇప్పుడు అమలు జరుగుతోంది. ఒక్కో ఇంటికి కనిష్ఠంగా ప్రతి నెలా రూ.60 నుంచి గరిష్ఠంగా రూ.90లకు వసూలు చేస్తున్నారు. చెత్త పన్ను వేసినా సరే పారిశుధ్య నిర్వహణలో విఫలమవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం లేదు. దోమలను నివారించలేకపోతున్నారు. ఈ కారణంగా చాలా మంది



● పెరిగిన అద్దెలు

గ్రామాలను బతుకుదెరువు కోసం పట్టణాలకు వస్తున్నారు. పిల్లల చదువుల కోసమని పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సామాన్య మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా పట్టణాలకు చేరిపోతున్నారు. అంతా అద్దె ఇళ్లల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆస్తి పన్నులు పెంచేయడంతో యజమానులు ఇంటి అద్దెలను పెంచేశారు. గతంలో భీమవరంలో రూ.3 వేలకు చిన్నపాటి ఇళ్లు దొరికిపోయేది. ఇప్పుడు నెలకు రూ.6000 చెల్లిస్తే గానీ చిన్నపాటి ఇల్లు దొరకడం లేదు. వ్యాపారాల కోసం తీసుకునే అద్దెల షాపులను పెంచేశారు. వ్యాపారాలు లేవు. కానీ అద్దెలు ఆకాశాన్ని తాకాయి. అద్దెలు పెరిగిపోవడంతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలు తమకు వచ్చిన ఆదాయాన్ని ఇంటి కోసం వెచ్చించాల్సి వస్తోంది. సంక్షేమ పథకాలు గొప్పగా ఇచ్చేస్తున్నామంటూ చెబుతున్న ప్రభుత్వం ఇలా ప్రజలపై భారం మోపే చర్యలకు పాల్పడుతోంది. కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది.

● మౌలిక వసతులు అంతంతే

ప్రజల నుంచి ఆస్తి పన్ను రూపంలో పెద్ద మొత్తంలోనే వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ తరహాలో మౌలిక వసతులు కల్పించడం లేదు. అధికార పార్టీ నేతలకు ప్రయోజనం చేకూర్చే తరహాలోనే కొద్దిపాటి అభివృద్ధి పనులను చేపట్టారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీలు అంతగా నిర్మించలేకపోయారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పనులను చేపట్టలేకపోయారు.

కాంట్రాక్టర్‌లకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పట్టణాల్లో అభివృద్ధి పనులు అంతగా ముందుకు సాగలేదు. మున్సిపాలిటీల ఆదాయంపైన ప్రభుత్వం షరతులు విధించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేసింది. ఫలితంగా కాంట్రాక్టర్‌లు పనులు చేపట్టేందుకు వెనకడుగు వేసే పరిస్థితి నెలకొంది. పట్టణాల్లో ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారు. తాగునీటి వసతులను మెరుగుపరచలేదు. ఎన్నడూ లేని విధంగా మంచి నీటి సరఫరా సమయంలో విద్యుత్ కోతలను అమలు చేస్తున్నారు. అయినాసరే శివారు ప్రాంతాలకు మంచినీరు సరఫరా కావడం లేదు. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉంది. తణుకు సమ్మర్ స్టోరేజ్ లేకుండా పోయింది. వీటిపై వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. టీడీపీ హయాంలో పాలకొల్లు, తణుకు పట్టణాలకు ఖరారుచేసిన పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను చేపట్టలేకపోయింది. పన్నుల బాదుడుపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనలో కొరవడింది.



భీమవరంలో అత్యధికం


- భీమవరం పురపాలక సంఘంలోనే అత్యధికంగా పన్నుల రూపంలో బాదే శారు. గతంలో భీమవరం మున్సిపాలిటీ ఆస్తి పన్ను ఆదాయం రూ.14 కోట్లు ఉండేది. ఇప్పుడది రూ.25 కోట్లకు చేరింది. చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. నీటి పన్నును పెంచేశారు.
- ఆ తర్వాత స్థానంలో తాడేపల్లిగూడెం ఉంది. ఇక్కడ ఏడాదికి రూ.9 కోట్లు పన్ను వసూలు చేయడం కష్టమయ్యేది. ఇప్పుడు ఆస్తి పన్ను ఆదాయం ఏకంగా రూ.15 కోట్లకు చేరింది. ఐదేళ్ల వ్యవధిలోనే ఇంతలా ఆదాయం పెరిగింది.
- తణుకు పట్టణానిదీ అదే పరిస్థితి. తణుకులో ఆస్తి పన్ను ఆదాయం రూ.7 కోట్లు రావడానికి ఆపసోపాలు పడేవారు. ఇప్పుడది దాదాపు రెట్టింపయ్యింది. ప్రతి ఏటా రూ.13 కోట్ల మేర డిమాండ్ ఉంటోంది.
- పాలకొల్లులో పన్ను ఆదాయం రూ.6 కోట్ల నుంచి రూ.10 కోట్లకు చేరింది.
- నర్సాపురంలో రూ.4 కోట్ల ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.6 కోట్లకు డిమాండ్ పెరిగింది. మొత్తంపైన జిల్లాలో ఆస్తి పన్ను గణనీయంగా పెరిగింది. ఆ ప్రభావం ఇతర రంగాలపైనా పడుతోంది.

నరసాపురం ఇన్‌చార్జ్‌గా తపనా చౌదరి



ఏలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు లోక్‌సభ స్థానాన్ని ఆశించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి విషయంలో మంగళవారం బీజేపీ క్లారిటీ ఇచ్చింది. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయడానికి అవకాశం లేకపోవడంతో దెందులూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దింపాలని బీజేపీ ఈ మధ్యనే పట్టుబట్టింది. ఈ నెల 24న నామినేషన్ దాఖలుకు ఆయన సన్నాహాలు చేసుకున్నారు. ఆ పార్టీకి ఇచ్చేందుకు టీడీపీ నో చెప్పడంతో తపనా చౌదరిని నరసాపురం లోక్‌సభ స్థానం బీజేపీ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇక్కడ పోటీ చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు చేదోడువాదోడుగా ఉండాలని సూచించింది. భవిష్యత్తులో ఆయనకు సమర్థవంతమైన అతిపెద్ద బాధ్యతను అప్పగిస్తామని బీజేపీ పెద్దలు వాగ్దానం చేశారు. దీంతో మెత్తబడిన తపనా చౌదరి బుధవారం వేద్దామనుకున్న నామినేషన్‌ను రద్దు చేసుకున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధపడుతున్నారు.

దూలంకు సవాల్



'రాష్ట్రంలో, కైకలూరులోను రాక్షస పాలన సాగుతోంది. దీనికి స్వస్తి పలకాల్సిన అవసరం అందరిపై ఉంది. రాజకీయంగా నన్ను ఎదుర్కొనే దమ్ములేక ఫేక్ వీడియోలు తయారుచేసి ఇతర కులస్తులను నేను దూషిస్తున్నట్టు సృష్టించే స్థాయికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దిగజారిపోయారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలే గాని ఫేక్ వీడియో సృష్టించి మతాల మధ్య చిచ్చు పెడితే చూస్తూ ఊరుకోను'.

- కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్



ఖర్చులు తడిసి మోపెడు

- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నరు. మధ్యలో టీ, కాఫీలు, చల్లటి నీరు. శీతల పానీయాలు ఎక్స్‌ట్రా.. రాజకీయ పార్టీ అభ్యర్థుల క్యాంపు కార్యాలయాల వద్ద అభ్యర్థులు చేస్తున్న ఏర్పాట్లు.. నోటిఫికేషన్ విడుదలైనప్పటికి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను చూసుకోవడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది. వీరి కోసం చేస్తున్న ఏర్పాట్లలో ఖర్చు తడిసి మోపెడవడంతో హడలిపోతున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



- ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దీనికోసం ప్రజల మధ్య కులాల చిచ్చు పెడుతున్నారు. ప్రజా స్వామ్యం అంటే మేము చెప్పింది వినడమే అన్న ధోరణి కొనసాగడం దారుణం. ఈ విధానాలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. కాబట్టి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి.

- పరకాల ప్రభాకర్

- జనచేతనం పేజీల్లో..

ఎంపీకి 9, ఎమ్మెల్యేలకు 19

జిల్లాలో ఐదో రోజు నామినేషన్లు

భీమవరం టౌన్/ఆచంట/తాడేపల్లిగూడెం రూరల్/ఉండి/తణుకు, ఏప్రిల్ 23: నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి మంగళవారం ఐదో రోజు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కలిదిండి వినోద్ కుమార్‌వర్మ, స్వతంత్ర అభ్యర్థులుగా మాడపాటి వెంకట వరా హాలరెడ్డి, కేతా శ్రీను, రామదుర్గాప్రసాద్, గేదెల లక్ష్మణరావు, అద్దేపల్లి వీరవెంకటసుబ్బారావు నామినేషన్ పత్రాలను దాఖ లు చేశారు. ఇప్పటికే నామినేషన్ దాఖలుచేసిన వైసీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, గూడూరి జగదీష్‌కుమార్ అదనంగా మరోసెట్ పత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకు 14 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు సమర్పించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం పాలకొల్లు, నర సాపురం మినహా మిగతా ఐదు నియోజకవర్గాల్లో 19 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. భీమవరం అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా పులపర్తి సత్యవేణి, చెరుకూరి కుసమ కుమారి పద్మావతి, అంకె వెంకటరమణ, వైసీపీ అభ్యర్థిగా గ్రంధి సత్యరవితేజ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున దండు శ్రీనివాసరాజు, పిరమిడ్ పార్టీ తరపున అల్లూరి శ్రీనివాసరాజు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున బస్వనీ పవన్‌కుమార్ నామినేషన్‌లు దాఖలు చేశారు. ఆచం ట జైభారత్ నేషనల్ పార్టీ తరపున వెలగల శ్రీనివాసరెడ్డి, తాడేపల్లిగూడెం బీఎస్పీ అభ్యర్థిగా కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మేక వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా మేకా వెంకటేశ్వరరావు, సిరివరపు సింహాచలం, ఉండి వైసీపీ అభ్యర్థిగా పెన్మెత్స వెంకట లక్ష్మీనరసింహరాజు, కాంగ్రెస్ అభ్యర్థులుగా వేగేశ్న గోపాల కృష్ణంరాజు, వేగేశ్న వెంకటరామరాజు, వేటుకూరి వెంకట శివరామరాజు, తణుకు స్వతంత్ర అభ్యర్థులుగా మామిడిశెట్టి మోహన్ అజి, కోడూరి మెహర్ చైతన్య నామినేషన్లు దాఖలు చేశారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ, తణుకు, ఆచంట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆరిమిల్లి, పితాని తదితరులు

నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏలూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ నామినేషన్ !



ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23 : ఏలూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మంగళవారం నామినేషన్ దాఖలు సమయంలో పార్టీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించారు. ఆర్వో కార్యాలయమైన కలెక్టరేట్‌కు 100 మీటర్ల మేర ఎవరూ లోనికి రాకూడదు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని వాహనాలను కలెక్టరేట్ చుట్టూ నిలుపుదల చేశారు. నామినేషన్ దాఖలు సమయంలో ఐదుగురికి మించి అభ్యర్థి వెంట లోపలకు వెళ్లకూడదు. కాని, సునీల్ వెంట మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, దూలం నాగేశ్వరరావు, కొఠారు అబ్బయ్యచౌదరి, విజయ్‌రాజుతోపాటు పలువురిని అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ నామినేషన్ సందర్భంగా విపరీతమైన ఆంక్షలు పెట్టిన పోలీసులు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను సైతం కలెక్టరేట్‌లోకి రాకుండా అడ్డుకోవడం గమనార్హం.

పాలకొల్లులో గంజాయి మత్తు



పాలకొల్లు/పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 23 : ప్రశాంతంగా వుండే పాలకొల్లు పట్టణంలో గంజాయి విక్రయాలు ఊపందుకున్నాయి. లారీ స్టాండ్, అన్న క్యాంటీన్ వెనుక వైపు, మార్కెట్ యార్డు, యడ్ల బజారు హిందూ స్మశాన వాటిక, రైల్వే గూడ్స్ షెడ్ వెనుక వైపు ప్రాంతాల్లో గుట్టుగా గంజాయిని విక్రయిస్తు న్నట్టు సమాచారం. జన సంచారం అధికంగా ఉండే మార్కెట్ ప్రాంతంలో ఒక మహిళ గంజాయిని విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల 15 - 20 ఏళ్ళ మధ్య వయసు గల యువత గంజాయికి అలవాటు పడి నిర్మానుష్య ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఎన్నికల హడావుడిలో పోలీసులు సైతం గంజాయి విక్రయాలపై దృష్టి సారించలేకపోతున్నారని, పోలీసులు దాడులు జరిపితే గంజాయి అమ్మకందారులు పట్టుపడతారని పరిశీలకులు సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో యువత మద్యం జోలికి వెళ్లడం లేదని, సిగరెట్లు కాల్చే వారి సంఖ్య తగ్గిందని ఈ మార్పు యువతలో సత్ప్రవర్తనకు సంకేతమని భావిస్తున్న తరుణంలో గంజాయి విక్రయాలు ఊపందుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. గంజాయి సాగు మొన్నటి వరకూ ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితం కాగా ఇప్పుడు సముద్ర తీర ప్రాంతంలోనూ (ఒక ఇంజనీరింగ్ కళాశాల వెనుక వైపు) తోటల్లోనూ సాగు చేస్తున్నట్టు తెలిసింది. గంజాయి అమ్మకాలను అరికట్టాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు. అలాగే గంజాయి పీల్చడానికి అలవాటుపడిన యువతను వారి కుటుంబ సభ్యులే గుర్తించి సక్రమ మార్గంలో పెట్టాల్సిన అవసరం వుంది.

కూటమి గెలుపు ఖాయం

» బీజేపీ రాష్ట్ర పరిశీలకుడు అబిత్‌సింగ్



ర్యాలీలో వర్మతోపాటు నిమ్మల, చినబాబు తదితరులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 23 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయానికి అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర పరిశీలకుడు అబిత్‌సింగ్ అన్నారు. కూటమి తరపున బీజేపీ ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం నామినేషన్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమిలోని సభ్యులంతా విజయం సాధించడంతో అధికారం చేపడతామన్నారు. ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ, తణుకు అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలోనూ కూటమి అభ్యర్థులదే విజయమన్నారు. అలాగే రాష్ట్రంలో జగన్ సర్కార్‌కు ఓటమి ఖాయమైందని, ఇక దీనిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్‌తోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తామని చెప్పారు. భీమవరంలో జరిగిన ర్యాలీ తన విజయానికి నాంది అని ఎంపీ అభ్యర్థి వర్మ ధీమా వ్యక్తం చేశారు. పెద అమిరం ఎన్టీఆర్ విగ్రహం నుంచి మొదలైన ర్యాలీ కలెక్టరేట్ వరకు ఐదు కిలోమీటర్ల మేర సాగింది. జువ్వలపాలెంరోడ్డు ఉమ్మడి పార్టీల జెండాలతో కార్లు, మోటర్ సైకిల్స్‌తో నిండిపోయింది. దారి పొడవునా పూలు చల్లుతూ స్వాగతం పలికారు. వర్మకు మద్దతుగా ఉండి, పాలకొల్లు అభ్యర్థులు కనుమూరు రఘు రామకృష్ణరాజు, నిమ్మల రామానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు), బీజేపీ నాయకుడు తపనా చౌదరి, పీవీఎస్ వర్మ, కోళ్ళ నాగేశ్వరరావు, పాకా వెంకటసత్యనారాయణ, కోమటి రవి, నార్ని తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

జగన్మాయ

స్మార్ట్ సిటీ దగా



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా మంజూరు చేసింది. షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీకి పనులు అప్పగించింది. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో స్మార్ట్ సిటీ అధ్వాన నగరమైంది. నగర ప్రజలను వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణానికి 2014లో టీడీపీ ప్రభుత్వం యూజీడీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అమృత్ నిధులు విడుదలయ్యాయి. పనులు కూడా చేపట్టారు. తర్వాత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని అటకెక్కించారు.

- ఏలూరు సిటీ / టూ టౌన్

- ఏలూరు స్మార్ట్ సిటీ ఊసెత్తలేదు
- నగరంలో భూగర్భ డ్రెయినేజీ ఏదీ...?
- అసంపూర్తిగా తమ్మిలేరు రక్షణ గోడ నిర్మాణం
- చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్న రహదారులు
- నగరంలో రహదారులు అధ్వానం
- వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి
- ఐదేళ్లుగా పరిష్కారం కాని, అమలుకు నోచని హామీలు

నెరవేరని సీఎం హామీలు



స్మార్ట్ సిటీ



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్

టీడీపీ ప్రభుత్వం ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో నగర ప్రజలు సంబరపడ్డారు. జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, పారిశ్రామికాభివృద్ధితో తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని నగర ప్రజలు ఆశపడ్డారు. దీనికి అనుగుణంగానే స్మార్ట్ సిటీ పనులను షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీకి ఆ ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ సంస్థ నగరంలో పర్యటించి రూ.1242.82 కోట్లు ఖర్చవుతాయని ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. ఆమోదించిన టీడీపీ ప్రభుత్వం స్విస్ ఛాలెంజ్ పద్ధతిపై రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంస్థను ఆదేశించింది. రూ.5.86 కోట్లను ప్రభుత్వ వాటాగా మంజూరు చేసింది. దీనిలో సుమారు రూ.2 కోట్లతో నగరంలో కొన్ని అభివృద్ధి పనులు జరిగాయి. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు అటకెక్కాయి. ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ములో మిగిలిన రూ.3.86 కోట్లు ఆచూకీ లేదు.

స్మార్ట్ కమిటీ

స్మార్ట్ సిటీ నిర్వహణకు కలెక్టర్ ఛైర్మన్‌గా, డైరెక్టర్లుగా ఎస్పీ, నగర పాలక సంస్థ కమిషనర్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ముగ్గురితో కమిటీ నియమించారు.

ప్రత్యేకతలు

అంతర్జాతీయ స్థాయి జీవన ప్రమాణాలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పారదర్శక పరిపాలన, పర్యావరణ పరిరక్షణ, నిరంతరం 24 గంటలు నీటి సరఫరా, మెరుగైన మురుగునీటి పారుదల సౌకర్యం, వరదల నివారణ, రక్షణ, భద్రత, అభివృద్ధి.

ఏలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం, ప్రస్తుతం ఏలూరు జిల్లా కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏలూరు నియోజకవర్గంలో విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది. శివారు కాలనీలకు అంతర్గత రహదారులు లేకపోవటంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాలు మినహా అన్ని చోట్ల రహదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా నగరంలో అంతంత మాత్రమే.

ఇవీ సీఎం ఇచ్చిన హామీలు

ఏలూరు నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతంలో ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత పర్యటించినప్పుడు ఎన్నో హామీలు ఇచ్చారు.

- ఏలూరు నగరాన్ని ముంచెత్తే తమ్మిలేరుకు రక్షణ గోడ నిర్మిస్తామని సీఎం జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. వర్షం వస్తే నగరం జలమయం కావడం సార్వసాధారణం
- జాలిపూడి డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. నామమాత్రంగా పూడిక తొలగింపు పనులకే పరిమితం. డ్రెయిన్ ఆక్రమణలు తొలగించలేదు. అభివృద్ధి చేయలేదు.
- వన్ టౌన్‌లో భూగర్భ డ్రైనేజి సమస్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంది. భూగర్భ డ్రైనేజి ఏర్పాటుకు నగరపాలక సంస్థ రూ.112కోట్లతో డీపీఆర్ రూపొందించినా కార్యరూపం దాల్చలేదు.

ఎమ్మెల్యే హామీలు

- తమ్మిలేరు గట్టుపై నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే ఆళ్ళ నాని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదు.
- నగరంలో రహదారులు పూర్తిస్థాయిలో నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నేటికీ రహదారులను పట్టించుకోలేదు.
- పోణంగి డంపింగ్ యార్డ్‌ను వేరొక ప్రాంతానికి తరలిస్తామని, చెత్త రీసైక్లింగ్ యూనిట్ నెలకొల్పుతామని హామీలు నెరవేరలేదు.
- శనివారపుపేట కాజ్‌వేపై వంతెన ఏర్పాటు నేటికీ ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదు.
- వాటర్ గ్రిడ్ పథకం అమలు కాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికీ ఏలూరు నగరంలో వేసవి కాలంలో స్వచ్ఛమైన తాగునీరు అంతంత మాత్రంగానే అందుతుందని చెబుతున్నారు.

భూగర్భ డ్రెయినేజీ



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులు ఇలాపైనే పగిలిపోతున్నాయి

యూజీడీ నిర్మాణానికి నిధులిలా..

కేంద్ర ప్రభుత్వం	రూ.10.05 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వం	రూ. 3.90 కోట్లు
కార్పొరేషన్	రూ.14.18 కోట్లు
పొల్యూషన్ బోర్డు	రూ. 9.31 కోట్లు
మొత్తం	రూ.38.48 కోట్లు

దశాబ్దాల తరబడి నగర వాసులను పట్టిపీడిస్తున్న సమస్య మురుగు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణంతో సమస్య పరిష్కరిస్తామని పాలకుల హామీ అమలుకోసం ఎదురు చూసిన నగర వాసులు నిరాశ చెందారు. 2014లో టీడీపీ ప్రభుత్వం యూజీడీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రాబోయే 30 ఏళ్ల ప్రజల అవసరాలు తీర్చే విధంగా డిజైన్ చేశారు. ఆపై మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని మరో 10 ఏళ్లకు పెంచుకోవడానికి రూపొందించారు. కేంద్రం అమృత్ పథకంలో రూ.37.48 కోట్ల మంజూరయ్యాయి. 29, 38, 39, 40, 50, 1వ డివిజన్లలో పూర్తిస్థాయి ముగురునీటి పారుదల ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ నిర్మాణం, 50 లక్షల లీటర్ల కెపాసిటీతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు 2017లో శ్రీకారం చుట్టారు. 21 కిలోమీటర్ల మేర భూమిలో పైపులు వేసి మురుగునీటి శుద్ధి కేంద్రం ప్లాంట్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ మొదలైంది. పనులన్నీ మధ్యలో ఉండగానే 2019 ఎన్నికలు వచ్చాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అటకెక్కించింది. నిధులున్నా పనులు ఆగిపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఏడేళ్ల క్రితమే కొన్న పైపులు కొన్ని పగిలిపోతున్నాయి, మరికొన్ని పాడైపోతున్నాయి.

ఇంకెన్ని రోజులు..!



ఖర్చు తడిసిమోపెడు

అభ్యర్థుల గగ్గోలు

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు హడలెత్తిపోతున్నారు. మండుతున్న ఎండలు, మరో వైపు విస్తృత ప్రచారం. అదే సమయంలో కార్యకర్తలు, పార్టీ అభిమానులను చూసుకోవడం అభ్యర్థులకు సవాలుగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల కార్యాలయాల వద్దఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నరు ఏర్పాటు చేస్తున్నారు. టీ, కాఫీలు, చల్లటి నీరు. శీతల పానీయాలు అందుబాటులో ఉంచుతున్నారు. ఏ సమయంలోనైనా అభిమానులు కార్యకర్తలకు ఆహార ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. పట్టణంలోని వార్డుల్లోనూ నియోజక వర్గ పరిధిలోని గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం జరిగే ప్రాంతాలలో పార్టీ నాయకులే ఆహార పానీయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలు ఇంకెన్నీ రోజులురా?... బాబూ అంటూలెక్క పెట్టుకుంటున్నారు. అభ్యర్థులకు కేవలం ఆహార పానీయాలకే రోజుకు లక్షల్లో ఖర్చవుతుందని అంచనా.

- పాలకొల్లు



సపరివార సకుటుంబ సమేతం

అభ్యర్థుల కుటుంబ ప్రచారం

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేయడం సాధారణం. ఈ ఎన్నికల్లో బంధుమిత్ర సపరివార సకుటుంబ సమేతంగా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు నియోజకవర్గం నలుమూలలా ప్రచార బాధ్యతలు చేపట్టారు. భార్య, కుమారులు, కోడళ్లు, సోదరులు, తల్లి, తండ్రి బంధుగణమంతా కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

కొన్ని దశాబ్దాలు వెనక్కి చూస్తే పోటీలో ఉన్న అభ్యర్థి తప్ప కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు కాదు. కుటుంబ సభ్యులతో కలసి ప్రచారానికి శ్రీకారం చుట్టింది కనుమూరి బాపిరాజు. 1978లో కైకలూరులో ఆయన భార్య అన్నపూర్ణమ్మ ప్రచారం చేశారు. ఆయన అత్తిలిలో పోటీచేసినప్పుడు కుటుంబ సభ్యులు భాగస్వాములు అయ్యారు. తరువాత చాలామంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యలను ప్రచారంలో దించారు. ఉండి నియోజకవర్గంలో కలిదిండి అబ్బాయిరాజు కుటుంబ సభ్యులతో ప్రచారం చేయించారు. భీమవరంలో నాచు వెంకట్రామయ్య బంధుగణం ఎన్నికల ప్రచారం చేశారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కూడా ఆయన కుటుంబసభ్యులతో ప్రచారం చేయించారు.

ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులతో పాటు వారి కుటుంబాలు ప్రచారంతో నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. పాలకొల్లులో నిమ్మల రామానాయుడు భార్య సూర్యకుమారి, దెందులూరులో చింతమనేని ప్రభాకర్ భార్య రాధారాణి, కుమార్తె నవ్యశ్రీ, తణుకు నియోజకవర్గంలో ఆరిమిల్లి రాధాకృష్ణ భార్య కృష్ణ తులసి, కుమారుడు నిఖిల్ రత్న నియోజకవర్గంలో వేర్వేరు మండలాల్లో ప్రతిరోజు ప్రచారం చేస్తున్నారు. ఉంగుటూరులో పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు, ఉండిలో రఘురామకృష్ణరాజు భార్య రమాదేవి, నరసాపురంలో బొమ్మిడి నాయకర్ భార్య, చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్ తండ్రి, ఆచంటలో పితాని సత్యనారాయణ కుమారుడు వెంకట్ ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. అభ్యర్థుల బంధువులంతా ఎండను సైతం లెక్కచేయకుండా కలియ తిరుగుతున్నారు.

- భీమవరం టౌన్



దెందులూరులో చింతమనేని కుమార్తె



పాలకొల్లులో నిమ్మల సూర్యకుమారి



ఉండిలో రఘురామకృష్ణరాజు భార్య రమాదేవి



వేల్పూరులో అరిమిల్లి తనయుడు నిఖిల్‌రత్న



చింతలపూడిలో రోషన్‌కుమార్ తండ్రి ప్రచారం



నరసాపురంలో నాయకర్ భార్య



తణుకులో ఆరిమిల్లి కృష్ణతులసి



పెదవేగిలో చింతమనేని రాధారాణి

ఆనాటి ముచ్చట

ఎన్నికల ఖర్చు ఊహించలేం



ముళ్ళపూడి వెంకట కృష్ణారావు
మాజీ ఎమ్మెల్యే తణుకు

నాటి ఎన్నికలకు నేటి ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంది. తణుకు నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించాను. 1985లో మొదటి సారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మా కుటుంబ సభ్యులు లక్షా యాభై వేలు ఖర్చు చేశారు. 1989లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ముళ్ళపూడి కుటుంబం అంతా చూసుకుంది. నాకు తెలిసి ఎన్నికల ఖర్చులు నాడు చాలా తక్కువ పరిమితిలో ఉండేవి. ఇపుడు ఖర్చులకు ఊహించుకునే విధంగా కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఒకపుడు రాజకీయాలు సేవకు మారు పేరుగా ఉండేవి. ఇపుడు రాజకీయాలు ఎందుకు చేస్తున్నారో అందరికి తెలుసు. రాజకీయాల్లో విలువలు లేకుండా పోయాయి, ఇది చాలా అనర్థాలకు దారితీస్తుంది.

- తణుకు

ఓటు ..ఎంతెంత దూరం!



మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

ప్రతీ సాధారణ ఎన్నికల్లో మండుటెండలో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి దళితవాడ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు స్థానికంగానే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు లోక్ సభ, శాసనసభ ఎన్నికలకు మాత్రం మూడు కిలోమీటర్లు నడిపిస్తున్నారు. కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మారుమూలన ఉన్న ముదినేపల్లి మండలం పేరూరు శివారు తేరగూడెం దళితవాడ ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తమ దళితవాడ నుంచి పేరూరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయాలి. దళితవాడలో 120 మంది ఓటర్లు ఉన్నారు. అధ్వాన్నపు రోడ్డుపైన నడుచుకుంటూ వెళ్లి ఓటు వేయటం ఇబ్బందికరంగానే ఉంది.

- ముదినేపల్లి

జీపులు.. ఆటోలకు గిరాకీ


ఎన్నికల ముందువరకు జీపులు, యజమానులు, ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక డీలా పడ్డారు. ఎన్నికల వేడి ఎప్పుడు మొదలైందో అప్పటి నుంచి జీపు యజమానులకు, డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు మంచి ఛాన్స్. రాజకీయ నాయకుల ప్రచారానికి జీపులు, ఆటోలు కావాలి. జీపు, ఆటోడ్రైవర్‌తో మాట్లాడి ఉదయం కాగానే గ్రామానికి ప్రచారానికి వెళుతున్నారు. జీపు రోజుకు రూ.3వేలు, డ్రైవర్ బేటా, డీజిల్ అదనం, ఆటోకు రూ.1500, డ్రైవర్ బేటా, డీజిల్ ఆయా రాజకీయపార్టీల నాయకులే భరించాలి. కార్యకర్తలతో పాటు డ్రైవర్లకు టిఫిన్ సౌకర్యం ఉంటుంది. గ్రామంలో ఉదయం 6 గంటలకు ప్రచారం ప్రారంభించి, 10 గంటలకు ముగించుకుని తాము తీసుకువెళ్లిన వాహనాల్లో తిరిగి గ్రామానికి చేర్చుతున్నారు. సాయంత్రం మరోసారి 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. సాయంత్రం కార్యకర్తలకు ఇచ్చే మందుబాటిల్ కోటాలోనే డ్రైవర్లకు క్వాటర్ బాటిల్ వస్తుంది. పెద్దగా కష్టపడకుండా జీపు, ఆటోడ్రైవర్లకు భలే గిరాకీ.

- ఏలూరు కల్చరల్

బాబ్బాబు.. రండి

జన సమీకరణకు వైసీపీ అభ్యర్థి తంటాలు

నామినేషన్‌కు పక్క నియోజకవర్గాల జనం



పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి గుడాల గోపీ జనసేకరణకు తంటాలు పడుతున్నారు. బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా భారీ సంఖ్యలో జనంతో బలనిరూపణ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కేడర్‌తో పాటు జనాన్ని రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున జన సమీకరణకు ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తుంది. అవసరమైతే పక్క నియోజకవర్గాల నుంచి సైతం జన సమీకరణ చేయడానికి సమాయత్తం అవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈనెల 19న టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు నామినేషన్ వేశారు. ఈకార్యక్రమానికి 20వేలకు పైబడి పార్టీ అభిమానులు హాజరయ్యారు. అందుకు దీటుగా జనసమీకరణ చేయడానికి వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందు కోసం ఇప్పటికే గ్రామాలు, పట్టణంలో వార్డులు వారీగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా జన సమీకరణకు పెద్ద ఎత్తున సొమ్ములు పంపిణీ చేస్తారని ప్రచారం జరుగుతుండటంతో జెండా పట్టే ఉత్సాహవంతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు ఉదయం అల్పాహారంతో పాటు శీతల పానీయాలు, మధ్యాహ్నం మాంసాహార భోజనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ అభ్యర్థి భారీ ఎత్తున సొమ్ములు పంపిణీ చేస్తారని ప్రచారం ముమ్మరంగా జరుగుతుండటంతో నామినేషన్ ప్రక్రియ నాడే సొమ్ములు పంపిణీ చేస్తారని పలువురు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- పాలకొల్లు

జగన్ మామా డబ్బులేవీ..

వసతిగృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మెటిక్ చార్జీలు

రెండు రోజుల్లో సెలవులు



బడుగు, బలహీనవర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు నిలిచిపోయాయి. తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో పేదలు వారి పిల్లలను కిలోమీటర్ల దూరంతో వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు ఇతరత్రా చేతిఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇచ్చిందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారి కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటినుంచి డబ్బులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరో రెండురోజుల్లో వసతిగృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈలోగా విద్యార్థుల డబ్బులు చెల్లిస్తారో లేదో చూడాలి. వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రతినెల కాస్మోటిక్ ఛార్జీల క్రింద మూడునుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30చొప్పు హెయిర్ కటింగ్ ఛార్జీల క్రింద అధనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకుఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలు జమ చేయాలి. జూన్‌నెలలో వసతిగృహాలు ప్రారంభమైతే రెండునెలలకు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిదినెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఐదేళ్లగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది.

- ఏలూరు రూరల్

ఎట్టెట్టా..!

ఆ..మండలానికి ఇద్దరు ఎమ్మెల్యేలు



ఒక మండలం..రెండు నియోజకవర్గాలు



పోడూరు, ఏప్రిల్, 23 : ఆ మండ లానికి ఇద్దరు ఎమ్మెల్యేలు. సగం గ్రామాలకు ఆచంట ఎమ్మెల్యే ప్రాతి నిధ్యం వహిస్తే మిగతా మండ లాలకు పాలకొల్లు ఎమ్మెల్యే పరిధి లోకి వెళతాయి. ఒక మండలంలో రెండు నియోజక వర్గాలకు ప్రాతినిధ్య వహిస్తోంది.. పోడూరు మండలం. ఈ మండలంలో 16 గ్రామాలు ఉండగా 8 గ్రామాలు ఆచంట నియోజకవర్గంలో మరో 8 గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్నాయి. అందుకే మండలాన్ని ఇద్దరు ఎమ్మె ల్యేలు పాలిస్తున్నారు. 2004 అసెంబ్లీ ఎన్నికల వరకూ పోడూరు మండలంలోని 16 గ్రామాలు ఆచంట నియోజకవర్గంలో ఉండేవి. 2004 ఎన్నికలు తర్వాత 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాలు పునర్విభజన జరిగింది. అప్పటి వరకూ ఆచంట నియోజకవర్గంలో ఉన్న పోడూరు మండ లంలోని 16 గ్రామాల్లో 8గ్రామాలు ఆచంట నియోజకవర్గంలోనికి మిగిలిన 8 గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలోకి వెళ్లిపోయాయి. పోడూరు, జగన్నాధ పురం, తూర్పుపాలెం, మినిమించిలిపాడు, కవిటం, పి.పోలవరం, గుమ్మలూరు గ్రామాలు ఆచంట నియోజకవర్గంలోనూ, అప్పన్నచెర్వు, పెనుమదం, వద్దిపర్రు, రావిపాడు, మట్టపర్రు, జిన్నూరు, వేడంగి, కొమ్ముచిక్కాల గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్నాయి. మండలంలో ఒకేసారి ఇద్దరు ఎమ్మెల్యేలు కార్య క్రమాలు పెట్టినప్పుడు మండలస్థాయి అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్, వ్యవసాయ శాఖ, మండలశాఖ అధికారులు ఇబ్బంది పడు తున్నారు. ఒక్కోసారి పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే పెట్టిన కార్యక్రమానికి హాజరై ఆచంట ఎమ్మెల్యే కార్యక్రమాలకు హాజరు కాకపోతే ఇక్కడికి పలానా అధికారి ఎందుకు రాలేదంటూ అధికారులపై చిర్రుబుర్రులాడిన సంఘటలను కూడా ఉన్నాయి. ఒకే మండలంలో ఇద్దరు ఎమ్మెల్యేల పాలన ఉండటం అధికా రులకు పెద్ద తలనొప్పిగా మారింది.

అధికారి మాట

ఎన్నికలయ్యేంతవరకు ఇక్కడే ఉంటా

ఉల్లంఘనలపై 91546 90388 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్



ఎన్నికల అబ్జర్వర్‌గా వచ్చిన రాజస్థాన్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ ప్రశాంతి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 23: ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చునని ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరి శీలకుడు కృష్ణకాంత్ పాఠక్ చెప్పారు. ఎన్నికల సాధారణ పరిశీకునిగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో తనను స్వయంగా కలిసి సమాచారాన్ని అందిం చవచ్చునన్నారు. ఉదయం 11 గంట ల్లోపు లేదా సాయంత్రం 5 గంటల దాటిన తర్వాత తనను కలిసి ఫిర్యాదులను వీలైతే సాక్ష్యాలతో సహా సమ ర్పించాలన్నారు. లేదా తన ఫోన్ నెంబర్ 91546 90388కు ఫోన్ చేసి వివరాలు తెలియ జేయవచ్చున్నారు. ఏలూరు పార్లమెంట్, ఏలూరు, ఉంగు టూరు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీల కునిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని రెవెన్యూ అతిథి గృహంలో బస చేశానన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఇక్కడే ఉంటానని, జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగి నట్టు ప్రజలు ఎక్కడైనా గుర్తిస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చున్నారు.

ఉద్యోగులంతా ఓటుహక్కు వినియోగించుకునేలా చేయండి

వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు



ఏలూరు రూరల్, ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఉద్యోగులందరూ ఓటుహక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాని కోరినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 15 వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులకు, ఇతర ఉద్యో గులకు ఓటుహక్కు వినియోగించు కోవాలంటే ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం నుంచి ఫారం- 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌తో ఓటుహక్కు వినియోగించుకోవాలని చెపుతున్నారని కాని చాలా జిల్లాల్లో ఈ రకమైన పరిస్థితి కనిపించడం లేద న్నారు. చాలామంది గ్రామ రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని దానివల్ల వారి సొంత గ్రామంలో ఓటుహక్కు విని యోగించుకోవడానికి చాలా జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్ తీసుకోవడానికి నిరాకరిస్తు న్నారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందరికి ఆ నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగానికి రిటర్నింగ్ అధికారి పరిధిలో చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వా లని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న బీఎల్‌వోలకు గత రెండేళ్ల నుంచి గౌరవవేతనం ఇవ్వ లేదని ఆ నిధులు తక్షణం విడుదల చేయాలని, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా ప్రభుత్వ విధానాలు

పరకాల ప్రభాకర్



నరసాపురం, ఏప్రిల్ 23 : ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని దీనికోసం ప్రజల మధ్య కులాల చిచ్చు పెడు తున్నారని ప్రముఖ ఆర్థిక నిపుణుడు,రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మండిపడ్డారు. ప్రజా స్వామ్యం అంటే మేము చెప్పింది వినడమే అన్న ధోరణ కొనసాగడం దారుణ మన్నారు. ఈ విధానాలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంద న్నారు. మంగళవారం రాత్రి అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో లౌకిక, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసం గించారు. దేశంలో చదువుకున్న 62 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు లేక రైతులు రోడెక్కి ఆందోళనలకు దిగుతున్నారన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో కూరుకుపోయిందని, తలసరి ఆదాయం 140వ స్థానానికి పడి పోయిందని వీటికి కారణం కేంద్రం తీసుకుంటున్న విధానాలేనన్నారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే దిపాటి రాజగోపాల్, నెక్కంటి సుబ్బారావు, చల్లా దానయ్య నాయుడు, పురేళ్ల శ్రీనివాస్, పోలిశెట్టి సూరిబాబు, చెన్నా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ బ్యాక్



చింతలపూడి..జిల్లాలోనే ఇది అతిపెద్ద నియోజకవర్గం. ఎస్సీ రిజర్వుడు అయిన ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట . రాజకీయంగా చైతన్యం చెందిన ఓటర్లు. అభివృద్ధి పరంగా ఇంకా వెనుకబడే ఉంది. వరి, పామాయిల్, మొక్కజొన్న వంటి ఉద్యాన పంటలే జీవనాధారం. వర్షాధారమైన చెరువులు, గొట్టపు బావుల ద్వారా సేద్యం ఆధారపడి ఉంది. తెలంగాణ సరిహ ద్దులో ఈ నియోజకవర్గం ఉంది. బౌద్ధ చరిత్ర కలిగిన గుంటుపల్లి గుహలు, తమ్మిలేరు, వెంగళరాయసాగర్ రిజర్వాయర్లు ఉన్నాయి. 400 లకుపైగా అనుసంధానం కలిగిన చెరువులు ఉన్నాయి. చింతల పూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు మెట్ట గ్రామాలకు, కృష్ణా జిల్లాకు మళ్ళించేలా కాల్వల నిర్మాణం చేపట్టారు.

- చింతలపూడి



చైతన్యపూడి

జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గం..
ఓటర్లలోనూ ప్రథమం
రిజర్వు నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెట్టప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధిలేక ఇప్పటికి వెనుకబడే ఉన్నా రాజకీయాల్లో మాత్రం చైతన్యం కలిగిన ప్రాంతం. తెలుగుదేశం పార్టీ రాకముందు స్థానిక సంస్థల రాజకీయాల్లో పార్టీల ప్రభావం కన్నా వర్గరాజకీయం నడిచేది. రెండు సామాజికవర్గాలు పోటీపడేవి. మండలాలు ఏర్పడక ముందు పంచాయతీ సమితి, భూమి తనఖా బ్యాంకుల పాలకవర్గాల ఎన్నికల్లో వెలమవర్గం తరపున కోటగిరి విద్యాధర్‌రావు, కమ్మ సామాజికవర్గం తరపున మందలపు సత్యనారాయణ వర్గం పోటీపడేవి. ఇవి ఎంతలా అంటే సర్పంచ్‌లను దాచిపెట్టి క్యాంపులు కూడా నిర్వహించేవరకు పోటీగా ఉండేది.

నియోజకవర్గంలో అభివృద్ధి

దశాబ్దాల కాలంగా నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గడిచిన ఐదేళ్లల్లో ఎంతో అభివృద్ధి సాధించింది. జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరును అందించేందుకు కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్ట్ వద్ద నీటి శుద్ధికేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన జరిగింది. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ పరిధిలో 2107 మంది పేదలకు జీప్లస్-3 విధానంలో అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్ళు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముందుకు వెళ్లలేదు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలకు ఐదు ఎకరాలు, కోర్టు నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించారు.

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన చింతలపూడి వైశాల్యంలోనూ, ఓటర్లలోనూ పెద్దది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికమే. మొత్తం నాలుగు మండలాల్లో 2,71,502 మంది ఓటర్లు ఉండగా,పురుషులు 1,33,747, మహిళలు 1,37,714 మంది, ట్రాన్స్ జెండర్లు 41 మంది ఉన్నారు. ఇందులో 3,967 మంది పురుషుల కంటే మహిళలే అధికం.

ముఖ్యమైన ప్రాజెక్టులు

ఈ నియోజకవర్గంలో చింతలపూడి తమ్మిలేరు, జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువల ప్రాజెక్టులు ఉన్నాయి. తమ్మిలేరు ద్వారా తొమ్మిది వేల ఎకరాలకు, ఎర్రకాలువ ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎర్రకాలువపై వందలాది మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు.

చారిత్రక, పర్యాటక ప్రదేశాలు

కామవరపుకోట మండలంలో గుంటుపల్లి బౌద్ధాలయ గుహలు. జంగారెడ్డిగూడెం మండలం కొంగు వారిగూడెం ఎర్రకాలువ జలాశయం, గుర్వాయిగూడెం ప్రముఖ పుణ్యక్షేత్రం మద్ది ఆంజనేయస్వామి ఆలయం ఉంది. చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఇమిడి ఉన్నాయని గతంలో అధికారులు గుర్తించారు. వాటిని వెలికి తీస్తే ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పోతుంది. ఆదాయం పెరుగుతుంది.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ముడపర్తి కూనేరావు	సీపీఐ	కెవీఎస్‌వీ రావు	కాంగ్రెసు	7,341
1962	రేవులగడ్డ ఏసుపాదం	కాంగ్రెసు	కె.సుబ్బారావు	స్వతంత్ర	2,965
1967	గద్దే విష్ణుమూర్తి	కాంగ్రెసు	ఐ.పాపారావు	స్వతంత్ర	10,825
1972	దన్నపనేని కూనేశ్వరరావు	స్వతంత్ర	ఐ.దానయ్య	కాంగ్రెసు	4,975
1978	గద్దే వెంకటేశ్వరరావు	కాంగ్రెసు(ఐ)	ఎం.సత్యనారాయణ	జనతా	5,250
1983	కోటగిరి విద్యాధరరావు	స్వంతంత్ర	కెఎల్ఎన్ రాజు	టీడీపీ	7,187
1985	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	11,075
1989	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	7,206
1994	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	13,783
1999	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.జమునారాణి	కాంగ్రెసు	31,890
2004	ఘంటా మురళీరామకృష్ణ	కాంగ్రెసు	కోటగిరి విద్యాధరరావు	టీడీపీ	1,506
2009	మద్దాల రాజేష్	కాంగ్రెసు	కర్రా రాజారావు	టీడీపీ	1,417
2014	పీతల సుజాత	తెలుగుదేశం	బూర్ల దేవీప్రియ	వైసీపీ	15,164
2019	ఉన్నమట్ల ఎలీజా	వైసీపీ	కర్రా రాజారావు	టీడీపీ	36,175



చింతలపూడి ఎత్తిపోతల పథకం

మూడు సార్లు మంత్రి పదవులు

1983లో ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో ఈ నియోజక వర్గంలో త్రిముఖ పోటీ జరిగింది. కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి రాకపోవడంతో రెబల్‌గా, స్వతంత్ర అభ్యర్థిగా కోటగిరి విద్యాధరరావు పోటీచేసి 7,187 ఓట్ల మెజార్టీతో తెలుగుదేశం అభ్యర్థిపై గెలుపొందారు. రాష్ట్రంలో ఈ విధంగా ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలవడంతో అందరితో పాటు కోటగిరి కూడా అధికారపార్టీ తెలుగుదేశంలో చేరారు. అప్పటి నుంచి 20 ఏళ్ల పాటు తెలుగు దేశానికి కంచుకోటగా నియోజకవర్గాన్ని నిలిపారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఘంటా మురళీరామకృష్ణపై 1606 ఓట్ల తేడాతో వరుసగా ఐదుసార్లు గెలిచిన కోటగిరి ఓటమి చవిచూశారు. ఈ ఓటమి వెనుక వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ప్రభావం ఉందని చెప్తుంటారు. విద్యాధరరావుని ఓడిం చాలనే 2003లో జిల్లాలో పాదయాత్ర ఏడురోజుల పాటు జరిపిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ నియోజక వర్గంలో మూడురోజులు ఉన్నారు.2009 నాటికి చింతలపూడి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా మారింది. జంగారెడ్డిగూడెం మండలాన్ని ఇందులో కలిపారు. దీంతో ఈ నియోజకవర్గం జిల్లాలోనే పెద్ద నియోజకవర్గంగా అత్యధిక ఓట్లు ఉన్న నియోజకవర్గంగా మారింది. 2009 ఎన్నికల్లో కూడా త్రిముఖ పోటీ జరిగింది. ఈ త్రిముఖ పోటీలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దాల రాజేష్‌కుమార్ కూడా 1417 ఓట్లతో తెలుగుదేశం అభ్యర్థి కర్రా రాజారావు పై పోటీచేసి విజయం సాధించారు.రాష్ట్రవిభజన తర్వాత 2014 ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు పోటీపడ్డారు. టీడీపీ తరఫున పీతల సుజాత పోటీచేయగా, వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మద్దాల రాజేష్‌కుమార్ భార్య బూర్ల దేవిప్రియ మధ్య పోటీ జరిగింది. 15,164 ఓట్ల మెజార్టీతో పీతల సుజాత విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా, టీడీపీ అభ్యర్థి కర్రా రాజారావుపై 36,175 ఓట్ల మెజార్టీ సాధించారు. 1983 నుంచి 2019వరకు ఉమ్మడి రాష్ట్రం, విభజన తరువాత జరిగిన మొత్తం అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఒకసారి, తెలుగుదేశం ఐదుసార్లు, కాంగ్రెస్ రెండుసార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించారు. ఇందులో కోటగిరి 20 ఏళ్ళపాటు ఎమ్మెల్యేగా వరుసగా విజయం సాధించగా, 20 ఏళ్ళలో ఆయన ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్‌గాను, ఎన్‌టీఆర్ హయాంలో వ్యవసాయశాఖా మంత్రిగాను, చంద్రబాబు హయాంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొద్దికాలం,తరువాత భారీ పరిశ్రమల శాఖామంత్రిగా పనిచేశారు. 2008లో ఆయన తెలుగుదేశం పార్టీని వీడి ప్రజారాజ్యంలో చేరారు. ఉంగుటూరులో పోటీచేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కాంగ్రెస్‌లో కొనసాగారు. 2014లో టీడీపీ తరఫున గెలిచిన పీతల సుజాత, చంద్రబాబు ప్రభుత్వంలో గనులు,స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

టీడీపీ కంచుకోట

టీడీపీ పార్టీ తరపున కోటగిరి విద్యాధరరావు 1985, 1989, 1994, 1999వ సంవత్సరంలో వరుసగా విజయం సాధించారు. దీంతో 1994, 1999వ సంవత్సరాల్లో విద్యాధరరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే పీతల సుజాత 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మూడు సంవత్సరాలు పనిచేశారు.

నామినేషన్ల కోలాహలం

అభ్యర్థులు భారీ ర్యాలీలతో , ప్రదర్శనలతో నామినేషన్లు వేసేందుకు తరలి వెళ్లారు. మంగళవారం ఏలూరులో ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, ఉంగుటూరులో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, కైకలూరులో బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.



పత్సమట్ల ధర్మరాజు నామినేషన్ సందర్భంగా ఉంగుటూరులో భారీ ర్యాలీగా కార్యకర్తలు,అభిమానులు





ఏలూరులో బడేటి చంటి నామినేషన్ సందర్భంగా బుట్టబొమ్మల సందడి.. డప్పు కళాకారుల విన్యాసాలు.. మంగళ వాయిద్యాలు




బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, ఎన్టీఆర్ వేషధారణలు



కైకలూరులో కామినేని శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

అభ్యర్థుల ఆస్తులు- అప్పులు

ఏలూరు (ఎంపీ అభ్యర్థి) : పుట్టా మహేష్ కుమార్ యాదవ్ (టీడీపీ)



విద్యార్హతలు : బీటెక్
కేసులు : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెండింగ్
స్థిరాస్తులు రూ.16.70 కోట్లు,
భార్యపేరున రూ.6.76 కోట్లు..
చరాస్తులు.. రూ.42.22 కోట్లు,
భార్య పేరున రూ.1.25 కోట్లు,
అప్పులు : రూ.19.67 కోట్లు,
భార్య పేరున : రూ.47 లక్షలు.

ఏలూరు : బడేటి రాధాకృష్ణయ్య (టీడీపీ)



విద్యా అర్హతలు : బీకాం.
స్థిరాస్తులు : 1,39,87,570
భార్య పేరున : కోటి 41 లక్షల 44 వేల 938
చరాస్తులు - లక్షా 58 వేల 122
భార్య పేరున - 22 లక్షలు
అప్పులు : 54 లక్షల 49 వేల 421
భార్య పేరున 31 లక్షల 84 వేల 758

కైకలూరు : డాక్టర్ కామినేని శ్రీనివాస్ (బీజేపీ)



చరాస్తులు : రూ.55 లక్షలు
భార్య పేరున రూ.1.04 కోట్లు
స్థిరాస్తులు : 6.55 కోట్లు
భార్య పేరున రూ. 2.39 కోట్లు
బంగారం : 1460 గ్రాములు
వ్యవసాయ భూమి : 11.75 ఎకరాలు
భార్య పేరున 4.24 ఎకరాలు
వాహనాలు : 24 లక్షలు విలువైన ఇన్నోవా కారు
భార్య పేరున 14.5 లక్షలు విలువ గల హోండా సిటీ
కేసులు : 2021లో కొవిడ్ సమయంలో మహా పాద యాత్రలో పాల్గొన్నందుకు కావలి పోలీసుస్టేషన్లో ఒక కేసు పెండింగ్‌లో ఉంది.

1.09 లక్షలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ.1920 విలువైన ఏడు లీటర్ల మద్యం సీజ్ చేశామని, లక్షా 9 వేల 800 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముగిసిన క్షీరారామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 23 : క్షీరా రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈసందర్భంగా మంగళవారం ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు, స్నపనములు, త్రిశూల స్నానం, చక్రస్నానం, కంకణ విమోచన తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లకు పుష్పోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

మావూరమ్మ జాతర ప్రారంభం



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్, 23 : బంగారు వారి చెరువు గట్టున బ్రాహ్మణ దేవతగా పిలువబడే మావూరమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. జాతర ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేసి, గరగ నృత్యాల, మేళతాళాలతో జాతర ప్రారంభించారు. రాత్రి గరగ నృత్యాలు, తీన్‌మార్, భేతాళ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కోర గేదెలు, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులతో జాతర అత్యంత భారీగా నిర్వహించారు. ఐదు రోజులు పాటు కుంకుమ పూజలు, నివేదనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శంకరావు శ్రీనివాసరావు, సభ్యులు కర్నేన గౌరునాయుడు, దొమ్మేటి వెంకట్రావు, యాదం శ్రీను, రౌతు అచ్చుతరావు, మిరియాల సాయి, గొల్ల నాగు, భార్గవ, ఉమ పాల్గొన్నారు.

ఘనంగా మార్లమ్మ జాతర



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 23: గొల్లగూడెం గ్రామదేవత మార్లమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. బంధువులు, స్నేహితులతో గ్రామం కిటకిటలాడింది. నిర్వాహకులు కోరశిఖ నాగరాజు, నరసింహారావు పర్యవేక్షించారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలి


ప్రచారం నిర్వహిస్తున్న నాయకర్, మాధవ నాయుడు

మొగల్తూరు, ఏప్రిల్ 23: రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం రామన్నపాలెం పంచాయతీలో జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. రామన్నపాలెం పంచాయతీ బండారు పేట, ఆకనవారి తోటగ్రామాల్లో నిర్వహించిన ఇంటింట ప్రచారంలో నాయకర్ సతీమణి బొమ్మిడి సునీత, కలవకొలను తాతాజీ, బండారు పటేల్ నాయుడు, కుక్కల మీరయ్య, మేకల ఆజా, పిప్పళ్ళ రామకృష్ణ పాల్గొన్నారు.

తోట సీతారామలక్ష్మికి అభినందన


తోట సీతారామలక్ష్మికి శుభాకాంక్షలు చెబుతున్న రఘురామ, ఎమ్మెల్యే రామరాజు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 23: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన తోట సీతారామలక్ష్మిని పలువురు టీడీపీ నాయకులు అభినందించారు. భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో తెలుగుమహిళా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు, టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, మెరగాని నారాయణమ్మ, కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్, పొత్తూరి రామాంజనేయులు, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు ప్రచారం

పాలకోడేరు, ఏప్రిల్ 23 : గోదావరి జిల్లాల ఆత్మగౌరవానికి, పులివెందుల వారి దౌర్జన్యానికి మధ్య జరుగుతున్న పోటీ ఇదని ఉండి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. కొండేపూడి గ్రామం నుంచి మంగళవారం రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారానికి ప్రజలు స్వాగతం పలికి హారతులిచ్చారు.

టెన్త్ ఫలితాలలో డాక్టర్ కె.కె.ఆర్ ప్రభంజనం


నాగ ఆశ్రిత

తణుకు, ఏప్రిల్ 23: తణుకు పట్టణంలో డా.కె.కె.ఆర్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో విజయఢంకా మ్రోగించారు. హాజరైన 72 మంది విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కె. నాగ ఆశ్రిత 600 మార్కులకు గాను 588 మార్కులతో స్కూల్‌లో ప్రథమ స్థానం, నమన్ రాయిస్ బాబు 585 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను చైర్మన్ కె.కోటేశ్వరరావు, డైరెక్టర్ అవినాశ్, జీఎం వీవీఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సతీశ్, డీన్ కిషోర్ అభినందించారు.

ఆచంటలో 56 క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో స్వామి నాయుడు

ఆచంట, ఏప్రిల్ 23: ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ మేనేజ్‌మెంట్‌పై మంగళవారం ఎన్నికల కార్యాలయం వద్ద ఎన్నికల అధికారి వి. స్వామి నాయుడు నరసాపురం డీఎస్పీ జి. శ్రీనివాస వర్మతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 56 పోలింగ్ కేంద్రాల్లో క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లుగా ప్రకటించడం జరిగిందని 135 పోలింగ్ స్టేషన్‌లలో లోపల, బయట కూడా వెబ్ కాస్టింగ్, సీఆర్‌పీఎస్‌కు అభ్యర్థన పంపడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 4 పోలింగ్ కేంద్రాలు లంకగ్రామాల్లో ఉన్నాయని వాటికి సంబంధించి పోలీసు ఫోర్సు ఏర్పాటు చేయాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఆకివీడు, ఏప్రిల్ 23:ఆకివీడు మండలంలో మంగళవారం 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.పెదకాపవరం-2, గుమ్ములూరు -1, ఆకివీడు-4లో 1, ఆకివీడు-3లో 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు.

ఒక లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలి


చిట్టిరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం రూరల్, ఏప్రిల్ 23: సివిల్స్ జాతీయస్థాయిలో 833వ ర్యాంక్ సాధించిన శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు కుమారుడు కొయ్యే చిట్టిరాజుకు డీఎన్నార్‌లో అభినందన సత్కారం, విద్యార్థులతో ముఖాముఖి భేటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టిరాజు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. విద్యతో పాటు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తన తండ్రి మోషేన్‌రాజు స్ఫూర్తి అని, మాకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారని తెలిపారు. కళాశాల అధ్యక్షకార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, సోదరులు సుందర్‌రాజు, పాలకవర్గ సభ్యులు గోకరాజు పాండురంగరాజు, కొత్తపల్లి శివరామరాజు పాల్గొన్నారు.

భీమవరంలో వైసీపీకి ఎదురు దెబ్బ

అంజిబాబు సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు


వీరవాసరంలో ప్రచారం చేస్తున్న అంజిబాబు

భీమవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగులుతోంది. నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడుతున్నారు. గడచిన నెల రోజుల నుంచి వైసీపీ నుంచి తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమిలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు ప్రతినిధులు, క్లస్టర్‌లు ఇన్‌చార్జ్‌లు ఇలా ఒక్కొక్కరూ జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. సర్పంచ్ రాట్నాల పేరయ్య ఇదివరకే జనసేనలో చేరారు. భీమవరం 27వ వార్డులో కోడి రాజు, బండి రమేష్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో అధికార పార్టీ శ్రేణులు జనసేనలో చేరిపోయారు. అలాగే జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు సమక్షంలో పట్టణంలోని 25,26 వార్డుకు చెందిన కాటుమూరి సురేష్, కాటుమూరి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో 50మంది వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. అంజిబాబు వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిని ఆదరిస్తాం... అక్కున చేర్చుకుంటామంటూ ఈ సందర్భంగా అంజిబాబు తెలిపారు. టిడ్కో ఇళ్లు తెలుగుదేశం పార్టీ నిర్మిస్తే వైసీపీ రంగులు వేసుకుందంటూ అంజిబాబు ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే అందరికీ టిడ్కో ఇళ్లు అందజేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వీరవాసరం మండలం కమతపల్లి, మత్స్యపురిపాలెం, బాలేపల్లి, నందమూరుగరువు, పెరికిపాలెం గ్రామాల్లో అంజిబాబు ప్రచారం చేశారు.

వైభవంగా కనక దుర్గమ్మ తీర్థం

పెనుమంట్ర, ఏప్రిల్ 23 : పెనుమంట్ర గ్రామదేవత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆలయం వద్దఉన్న చెరువు చుట్టూ కనులు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. విచిత్ర వేషధారణలు డప్పు వాయిద్యాలు గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, శక్తి వేషాలతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు భక్తులు అమ్మ వారికి మొక్కుబడులు చెల్లించారు.

అమ్మవారిని దర్శించుకున్న పితాని


దుర్గమ్మను దర్శించుకుంటున్న పితాని

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆయనకు అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. శెట్టి బలిజ రామాలయంలో సీతారాముల విగ్రహాలకు పూల మాల వేసి పూజలు చేశారు. స్థానిక చెరువులోని సీతారాములకు తెప్పపై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, యర్రా రాధాయగోపాల్, గంటా దుర్గారావు, కడలి ఏడు కొండలు జుత్తిగ సూర్యారావు, జుత్తిగ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆరిమిల్లికి హారతి ఇస్తున్న మహిళలు.. కృష్ణతులసిని సన్మానిస్తున్న మహిళలు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 23: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం అత్తిలి గాంధీనగర్‌లో గంగిరెద్దుల, యానాదుల సంఘాలు, తూర్పుకాపు, యాదవ యువత ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంఘాల నాయకులు కవల నాగులు, కలిదిండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అరకొర సంక్షేమమే: కృష్ణతులసి

జగన్ ప్రభుత్వం ప్రజలకు అరకొర సంక్షేమం అందించి, ప్రచారం మాత్రం ఘనంగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. మంగళవారం సాయంత్రం 22వ వార్డులో రాధాకృష్ణ విజయం కోసం ఆమె ఇంటింటా నిర్వహించారు. అదే పనిగా బటన్ నొక్కుతున్నానని జగన్ చెబుతున్నారని, అయితే చాలా మందికి సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. నియోజకవర్గ, రాష్ట్ర పరిస్థితులను ఇంటింటికి వెళ్ళి వివరిస్తున్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రయోజనాన్ని, సూపర్ సిక్స్ పథకాలు వల్ల వచ్చే లబ్ధిని వివరించి ఆరిమిల్లి గెలుపునకు సైకిల్ గుర్తుపైన, పార్లమెంటుకు కమలం గుర్తుపైన ఓటెయ్యాలని కోరారు. మహిళలు వైసీపీ అవినీతి పాలనలో జనం విసిగిపోయారని, అభివృద్ధి మచ్చుకైనా కనిపించడం లేదని, సంక్షేమం మాయలా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బసవా రామకృష్ణ, కలగర వెంకట కృష్ణ, ఒమ్మి రాంబాబు, తమరాపు రమణమ్మ, ఇందిరాదేవి, కీర్తి శివప్రసాదు, నడిపల్లి సతీష్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, నల్లవాసు, రెల్లు రాగూర్, వెంకటేశ్వరరావుతో పాటు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పితాని సమక్షంలో టీడీపీలో చేరిక



పితాని సమక్షంలో టీడీపీలో చేరిన విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు.. పెనుగొండలో పితాని తనయుడు వెంకట్ ప్రచారం

పెనుగొండ/పోడూరు, ఏప్రిల్ 23: పెనుగొండకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పితాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పితాని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలకు టీడీపీలో గుర్తింపువచ్చిందని కుల వృత్తులకు ఆదరణవంటి పథకాలు అమలు చేశారన్నారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మోజు ప్రసాద్, మనోవర్తి చక్రపాణి, మృదుపాక శ్రీను, అనుపోజు గణేష్ ఉన్నారు. అనంతరం పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో పితాని ప్రచారం చేశారు.

పితాని తనయుడి ప్రచారం

రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణకు, బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మకు ఓట్లు వేసి గెలిపించాలని పితాని తనయుడు పితాని వెంకట్ అన్నారు. పెనుగొండలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కటికిరెడ్డి నానాజీ, కొండవీటి శ్రీనివాసరావు, గుర్రాల సూరిబాబు, వేండ్ర రాము, బండారు నాయుడు, మద్దింశెట్టి వెంకటేష్, గిరే నాగరాజు పాల్గొన్నారు.

- ఆచంట, ఏప్రిల్ 23: వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణను గెలిపించాలని కళాకారుల బృందం ప్రచారం చేస్తున్నారు.

'నిరుద్యోగులతో వైసీపీ చెలగాటం'

నరసాపురం, ఏప్రిల్ 23: రాష్ట్రానికి రాజధాని, అభివృద్ధి కావాలంటే ముఖ్యమంత్రిగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబులాంటి నాయకుడు సీఎం కావాలని, ఈ సారి ఎన్నికల్లో ఓటర్లు కూటమికి పట్టం కట్టాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలంకి సుబ్బరాయన్, పెద్దన్న గౌడ్ కోరారు. మంగళవారం తెలగకళ్యాణ మండలంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా చేయడంతో పాటు గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చాడని మండిపడ్డారు. వివిధ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చేలగాటమాడటం దారుణమన్నారు.

వైభవంగా కోదండ రాముడి కల్యాణం



భీమవరం టౌన్, ఏప్రిల్ 23 : పద్మాలయ థియేటర్ సమీపంలోని కోదండ రామాలయంలో ప్రముఖ కాంట్రాక్టర్ పళ్ళ ఏసుబాబు, కుమార్తె శృతి, శివ ప్రకాష్ దంపతులచే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు కల్యాణ మహోత్సవం వీక్షించి స్వామివారిని దర్శించుకుని, అన్న సమారాధనలో పాల్గొన్నారు.

26, 27 తేదీలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 23 : ఈనెల 26, 27 తేదీలలో తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు చాంబర్స్ కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిట్, యాక్సెస్ బ్యాంక్, ఐ సెక్యూరిటీస్ పాల్గొంటాయని ఆయన తెలిపారు ఇంటర్వ్యూలకు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారు హాజరు కావచ్చునని, అభ్యర్థులు తమ అకడమిక్ సర్టిఫికెట్లు జిరాక్స్‌లతో పాటు 2 పాస్‌పోర్టు ఫొటోలు, బయోడేటాను తీసుకురావలసి ఉంటుందన్నారు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కలిదిండి రామరాజు మాట్లాడుతూ ఎంపికైన వారికి నెలకు రూ.20వేల నుంచి 58 వేల వరకూ వేతనం లభిస్తుందన్నారు. బి ఎస్సీ, బీకాం, బీబీఎం, ఎంసిఏ, బీఈ, బీటెక్ కలిగిన వారు (2018 నుంచి 2023 మధ్యలో ఉత్తీర్ణులైవారు) అర్హులని వారు తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. లక్ష్మణరావు, సెల్‌నెంబరు 97013 94660, కళాశాల ఫోన్ 08814 - 229521కు సంప్రదించాలని కోరారు.

'కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం'


విలేకర్లతో మాట్లాడుతున్న సతీశ్

నరసాపురం టౌన్, ఏప్రిల్ 23: వైసీపీ ఎన్ని హామీలు, కుతంత్రాలు, ప్రలోభాలు పెట్టినా ఓటర్లు మాత్రం కూటమి అభ్యర్థుల్ని గెలిపించేందుకు సిద్ధమయ్యారని బీజేపీ కన్వీనర్ మేకల సతీశ్ అన్నారు. మంగళవారం స్టీమర్‌రోడ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ఈకారణంగానే జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల నామినేషన్లల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. అనంతరం సుమారు 80కార్లలో బీజేపీ ఎంపీ శ్రీనివాసవర్మ నామినేషన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్, మునికోటి వెంకటేశ్వరావు, కంచర్ల నాగేశ్వరరావు, పండు, ప్రతాప్, నళిని, ఆరుణ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

నరసాపురం టౌన్, ఏప్రిల్ 23: పట్టణ, మండలంలో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు రోడ్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠనం చేశారు. మండలంలోని కొప్పర్రు, సీతారాంపురం, చిట్టవరం, వైఎస్‌పాలెం గ్రామాల్లోని ఆంజనేయ విగ్రహాలు వద్ద పూజలు చేశారు.

వైఎన్ కళాశాల ప్రగతి భేష్


వీసీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ చినమిల్లి

నరసాపురం టౌన్, ఏప్రిల్ 23: విద్యార్థుల్ని తీర్చిదిద్దడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైఎన్ కళాశాల సాధిస్తున్న ప్రగతిని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీ కె.పద్మరాజు ప్రశంసించారు. మంగళవారం యూనివర్సిటీ ఏర్పడి 18ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైఎన్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబాలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆర్‌వి సబ్బారావు, కెవిఎస్ ప్రసాద్, గంథం రామకృష్ణలు ఉన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, ఏప్రిల్ 23: విద్యుత్ మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి 9.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉండి, ఆకివీడు, కాళ్ళ మండలాల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని తెలిపారు.

తణుకు: ఉదయం 6.30 గంటల నుంచి 9గంటల వరకు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ సీహెచ్. రామకృష్ణ తెలిపారు. తెలిపారు.

'పార్టీలో చేరికలపై తప్పుడు ప్రచారం'

యలమంచిలి, ఏప్రిల్ 23: వైసీపీ పార్టీకి చెందినవారికే కండువాలు కప్పి, పార్టీలో పెద్దఎత్తున చేరికలు అంటూ తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ అడవిపాలెం గ్రామ కమిటీ కార్యదర్శి గుడాల అన్నవరంబాబు అన్నారు. అడవిపాలెం గ్రామంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అన్నవరం బాబు మాట్లాడుతూ అడవిపాలెం గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలంతా 1983 నుంచి ఇప్పటివరకూ పార్టీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. అధికసంఖ్యలో కుటుంబాలు వైసీపీ పార్టీలో చేరారని తప్పుడు ప్రచారం చేసుకోవాల్సిన దుస్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారని విమర్శించారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

పెంటపాడు, ఏప్రిల్ 23: విద్యార్థులు చదువులో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈవో-2 టీవీ రామకృష్ణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మానవత ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందించి సత్కరించారు. మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే విలువైన ఆస్తి చదువే అన్నారు.



వ్యాధులపై అపోహలు వద్దు

పెంటపాడు, ఏప్రిల్ 23: కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలెవ్వరూ అపోహ పడవద్దని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని దర్శిపర్రు, అలంపురం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్గిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, ఏప్రిల్ 23: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 25న రాజానగరం జీ ఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యనిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, క్యాన్సర్, చిన్నపిల్లలు, స్త్రీ సంబంధ వ్యాధులు, గుండె చికిత్స నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలు, ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



పెనుగొండ, ఏప్రిల్ 23: వడలి గ్రామంలో ఎన్‌టీఆర్ కూడలి వద్ద 100 లీటర్ల పెరుగుతో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దొడ్డిపట్ల రాజు జ్ఞాపకార్థం అతని పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులు చలి వేంద్రం ఏర్పాటు చేశారు.

నీటిని పొదుపు చేయండి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 23: జీవకోటి మనుగడకు ప్రాణాధారమైన నీటిని పొదుపు చేసి భావితరాలకు అందించాలని ఏపీఎస్ఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నీటి పొదుపుతో కలిగే ఉపయోగాలు, వృథా చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ముందుకు సాగారు. హెచ్‌ఎం పి. విజయకుమారి, ఉపాధ్యాయులు యోహాన్, రాంబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ జె ట్యాక్స్‌కు ఆక్వా రంగం బలి: నిమ్మల


చించినాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, ఏప్రిల్ 23: సీఎం జగన్ జె ట్యాక్స్ ధనదాహంతో ఆక్వా రైతాంగం పూర్తిగా బలైందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. చించినాడ గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు సబ్సిడీతో కూడిన విద్యుత్తును అందించామని, జగన్ ప్రభుత్వం రద్దు చేయడంతో ఆక్వా రంగం కుదేలయ్యిందని అన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి

పాలకొల్లు టౌన్, ఏప్రిల్, 23 రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతీ కుటుంబానికి లబ్ధి కలిగే పథకాలు అనేకం అందనున్నాయని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 28వ వార్డులో కూటమి శ్రేణులతో కలిసి మంగళవారం ఆమె ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు, ఉచితంగా బస్సు ప్రయాణంతో పాటు మహిళలందరికీ అనేక సంక్షేమ పథకాలు అందనున్నాయన్నారు.

కూటమిని గెలిపించాలి: బొలిశెట్టి


ప్రచారంలో పాల్గొన్న బొలిశెట్టి, వలవల, తాతాజీ

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 23: నియోజకవర్గంలో అవినీతి పాలన నిర్మూలించేందుకు కూటమికి పట్టం కట్టాలని తాడేపల్లిగూడెం ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. మంగళవారం పట్టణంలోని జువ్వలపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. బొలిశెట్టికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనా విధానాలతో ప్రజలంతా విసిగి పోయారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి తప్పనిసరిగా అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం భారీ మెజారిటీతో ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి ని గెలిపించాలన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలన్నారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, బండి పెద్దిరాజు, వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

పెంటపాడు, ఏప్రిల్ 23: వైసీపీ అరాచక పాలన అంతానికి ప్రతి ఒక్కరూ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బొలిశెట్టి సమక్షంలో పెంటపాడు గ్రామానికి చెందిన డాక్టర్ హనుమంత రావు, శేషు, వార్డు సభ్యురాలు ఒలిరెడ్డి సాయికృష్ణ, ప్రసాద్ తదితరులు జనసేనలో చేరారు. బొలిశెట్టి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి



కాళ్ళ, ఏప్రిల్ 23 : శివారు గ్రామ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి కలవపూడి సర్పంచ్ గేదల జాన్ విన్నవించుకున్నారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి తాగునీటి సమస్యను వారికి విన్నవించుకున్నామని సర్పంచ్ జాన్ విలేకరులతో తెలిపారు. సుమారు నెల రోజుల నుంచి కాళ్ళ మండలంలో శివారు గ్రామాలకు ప్రధాన పంట కాలువ అయిన అన్నయ్యకోడు పూర్తిగా అడుగంటి నీరు లేక తాగునీటి చెరువులు అడుగంటాయని వాపోయారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రానున్న నాలుగు, ఐదు రోజుల్లో పూర్తిస్థాయిలో కాలువలకు తాగునీరు విడుదల చేసి మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకునే విధంగా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.

చిత్రకళలో బంగారు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు, ఏప్రిల్ 23: జాతీయ స్థాయి చిత్ర కళా పోటీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని హెచ్‌ఎం పద్మావతి తెలిపారు. మంగళవారం విజేతలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అమీర్ ఆర్ట్ అకాడమీ నెల్లూరు, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ విజయవాడ నిర్వహించిన పోటీల్లో 35 మంది విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారని చిత్రకళా ఉపాధ్యాయుడు డాక్టర్ వెంపటాపు అన్నారు. విజేతలను పాఠశాల సెక్రటరీ జి.జె.ప్రభువరం, కనకేశ్వరి, శైలజ, ఉమాదేవి, వీరభద్రం, వీరబాబు అభినందించారు.